సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



గొప్ప విద్యా సంస్థగా వైఎస్సార్ ఏఎఫ్‌యూ

వైఎస్సార్ ఏఎఫ్‌యూ దేశంలోనే గొప్ప విద్యా సంస్థగా నిలుస్తుందని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి అన్నారు. -8లో



పన్నెండేళ్లకే.. నూరేళ్లు నిండాయి

స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు (12) నీట మునిగి ప్రాణాలను కోల్పోయి తల్లిదండ్రులకు విషాదాన్ని మిగిల్చాడు. ఈ సంఘటన కడపలో జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.110	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 76 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆలయం ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజు శనివారం తెలియజేశారు.ఈమేరకు దేవదాయశాఖ కర్నూలు ఉప కమిషనర్ గురుప్రసాద్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఇరవైరోజుల లోపు సభ్యులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.దరఖాస్తులను దేవదాయ శాఖ కర్నూలు ఉప కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని రవీంద్రరాజు తెలిపారు.

డీఈఓగా శివప్రకాష్‌రెడ్డి



రాయచోటి : అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారిగా(డీఈఓ) యు.శివప్రకాష్‌రెడ్డి శనివారం రాయచోటిలోని డీఈఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా గూడూరు ఉప విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న శివప్రకాష్‌రెడ్డికి పదోన్నతి కల్పిస్తూ అన్నమయ్య జిల్లా డీఈఓగా నియమించారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఈఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీరామ్ పురుషోత్తం తిరిగి మదనపల్లి డిప్యూటీ డీఈవో గా వెళ్లారు. ఈ సందర్భంగా నూతన విద్యాధికారి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. ఇందుకు సిబ్బంది, సంఘ నాయకులు సహకారం అందించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె సిటీ: జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి ప్రవేశానికి పరీక్షలు నిర్వహించారు. 678 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 494 మంది పరీక్ష రాశారు. పరీక్షలను మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డిలు పరిశీలించారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 857 మంది దరఖాస్తు చేసుకోగా 591 మంది పరీక్ష రాశారు. నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు పరీక్షలను పర్యవేక్షించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రవేశ పరీక్షకు నిఖిల, యువ ఆలస్యంగా వచ్చారు. వీరిని ప్రవేశ పరీక్షకు అనుమతించలేదు. దీంతో వెనుదిరిగారు.

ఉపాధి కల్పనకు ప్రణాళిక

- 2024–25 ఆర్థిక సంవత్సరానికి కసరత్తు
- రూ.468.54 కోట్ల అంచనా వ్యయం..
- గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు..



తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలో పూడికతీత పనులను చేపడుతున్న కూలీలు

రాయచోటి: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను అరికట్టి, ప్రజలకు పని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాల అభివద్ధికి అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల గుర్తింపు ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. జిల్లాలోని 30 మండలాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు అంశాలపై మొదటి, రెండో దశ సభలను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని వలస జీవులకు, రైతుల కూలీలకు మరింత జీవనోపాధి కల్పించే విధంగా ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి గతేడాది కంటే రూ.168 కోట్ల తేడాతో అంచనా వ్యయం నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ సిబ్బంది ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించనున్నారు.

లక్ష్యసాధనకు చర్యలు

2023–24 ఆర్థిక సంవత్సరం గతేడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కాగా, ఈ ఏడాది మార్చి చివరి నాటికి పూర్తవుతుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 38357 మందికి ఒక కోటి 3లక్షల 43 వేల పనిదినాలు కల్పించాలన్నది లక్ష్యం. ఇందుకు రూ.468.54కోట్లను వేతనాలకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు 89 లక్షల పని దినాలు నమోదయ్యాయి. ఈ మార్చి చివరి నాటికి లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మెటీరియల్‌కు సంబంధించి రూ.133.28 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం కలిపి రూ.300.81 కోట్లు ఆర్థిక సంవత్సరానికి కేటాయించారు. 2023–24 సంవత్సరంలో వేతన జీవుల జీవనోపాధికి ఉపాధి పథకం ఉపయోగపడింది. ప్రస్తుతానికి 8492919 కుటుంబాలకు పని కల్పించారు. ఇందులో 2440 మంది రైతులు పండ్ల తోటల సాగులో భాగంగా రూ.634.83 లక్షలు ఖర్చు చేశారు. వీటి ద్వారా కూడా అనేకమందికి ఉపాధి లభించింది. 73 లక్షల పని దినాలు లక్ష్యం కాగా, ఇంతవరకు 70 లక్షల పని దినాలు పూర్తయ్యాయి. మార్చి చివరి నాటికి 2.5 లక్షల పనిదినాలను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి దాకా కూలీలకు రూ.173.61 కోట్లు ఖర్చు చేశారు. 2023–24కు సంబంధించి మెటీరియల్ కు రూ.100.28 కోట్లు కేటాయించారు. ఈ మొత్తంతో సిమెంటు రోడ్లు, మెటల్ రోడ్లు, భవనాల పనులు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ సెంటర్లు తదితర పనులు చేశారు. వీటికి సంబంధించి రూ.80.1 కోట్ల బిల్లులను చెల్లించగా మిగిలిన పనులకు సంబంధించి మరో రూ. 20 కోట్లు ప్రభుత్వ అనుమతి రాగానే చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు డ్వామా అధికారుల సమాచారం.

వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూ.468.54 కోట్లు..

2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.468.54 కోట్లతో ఉపాధిహామీ పనులను నిర్వహించేందుకు అంచనా బడ్జెట్‌ను సిద్ధం చేశారు. గ్రామ సభల ద్వారా గుర్తించిన పనులను చేపట్టనున్నారు. ఒక కోటి 34 లక్షల 3వేల పనిదినాలు చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నారు. ఇందుకు రూ.269 కోట్ల వేతన జీవులకు ఖర్చు చేయనున్నారు. అలాగే మెటీరియల్‌కు సంబంధించి రూ.179.52 కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. ఈ నిధులతో సమెంటు రోడ్లు, మెటల్ రోడ్లు, భవనాల పనుల పనులు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వైఎస్సార్ డజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ సంటర్ల పనులు చేపట్టనున్నారు. ప్రధానంగా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇస్తారు. కొత్తగా ఫోకస్ ఏరియా వర్క్స్ పేరిట వివిధ రకాల పనులను నిర్వహించనున్నారు.

56 రకాల పనులు



ఉపాధిహామీ పథకం కింద 56 రకాల పనులు చేపట్టవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా పంట చేలలో నీటి కుంటలు, కందకాల తవ్వకం, పూడికతీత, పశువుల పాకలు, పంట కల్లాల నిర్మాణం, పశుగ్రాసం పెంపకం, పండ్ల తోటలు, గట్లపై టేకు చెట్లు పెంపకం, వర్షం నీటి మళ్లింపు కాల్వలు, బంజరు భూములను సాగుకు యోగ్యంగా మార్చడం, రహదారులు, మట్టిరోడ్లు, శ్మశాన వాటికల అభివద్ధి చేపట్టనున్నారు. నర్సరీల నిర్వహణ, హరితహారం మొక్కల సంరక్షణ, పంచాయతీ, అంగన్ వాడీ భవనాల నిర్వహణ, చెరువుల నిర్మాణం, పూడికతీత పనులను గ్రామ సభలో ఆమోదించవచ్చు.

- ఉపాధిహామీ పథకంలో ప్రజల అభీష్టం మేరకు ఉపయోపడే పనులను మాత్రం చేపడతారు. ఇందు కోసం పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలే కీలకం. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఏ పనులు చేపట్టాలో సర్పంచ్, ఉపాధి ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు కలిసి సభలో పాల్గొని పనులను గుర్తించి ఆమోదిస్తారు. ఈమేరకు జిల్లా స్థాయి అధికారులకు నివేదికలను పంపుతారు.

లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు



2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించాం. గ్రామాల్లో ఆమోదించిన పనులు చేపట్టేలా చూస్తాం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా బడ్జెట్ అంచనా వ్యయం ఖరారైంది. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పనుల నిర్వహణపై నిఘా పెడుతున్నాం.

–జి.మద్దిలేటి, డ్వామా పీడీ, అన్నమయ్య జిల్లా

ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలి



మాట్లాడుతున్న ఆచార్య కె. హేమచంద్రారెడ్డి

వైవీయూ: రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ఉన్నత విద్య చదవాలని, వారి ఉజ్వల భవిష్యత్తు అత్యున్నతంగా ఉండాలని, సమకాలీన ప్రపంచంలో నైపుణ్యత గల యువతగా తయారవ్వాలని ఆకాంక్షించి రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకొవచ్చిందని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన 'స్టూడెంట్స్ ఇంటరాక్టివ్ సమావేశం'విశ్వవిద్యాలయంలోని తాళ్లపాక అన్నమాచార్య సేనేట్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ 4 శాతం జీడీపీని విద్యారంగానికి ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. నాలుగేళ్లలో 73 వేల కోట్లు విద్యపై ఖర్చు చేశామని వివరించారు. 2018–19 సంవత్సరంలో విద్యలో ఆంధ్రప్రదేశ్ గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో 32.4 ఉండగా దాన్ని 2022 నాటికి 37.2 శాతానికి తీసుకొచ్చామన్నారు. అలానే 2018లో 83 వేల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ తర్వాత డిస్‌కంటిన్యూ కాగా, నేడు దాన్ని 22 వేలకు తగ్గించామన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్య చదవాలన్న ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. . ప్రతి విశ్వవిద్యాలయం విజన్‌తో పనిచేయాలన్నారు. పరిశ్రమలతో, సమాజంతో విద్యారంగాన్ని అన్వయించి నైపుణ్య ఆధారిత విద్య అందిస్తున్నామని తెలిపారు. వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రగతిని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరిస్తూ ఆయన ప్రొఫైల్‌ను సభ ముందు ఉంచారు. అనంతరం విశ్వవిద్యాలయం తరఫున చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్, వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్ రెడ్డి, సీడీసీ డీన్ ఆచార్య రఘుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కొండయ్య

రాజంపేట రూరల్: విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ ఎన్ కొండయ్య హెచ్చరించారు. మన్నూరులోని యూపీహెచ్‌సీని శనివారం డీఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మందుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యురాలు స్నేహలత సీనియర్ అసిస్టెంట్ యు సిద్దిరామయ్య, ఫార్మాసిస్ట్ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలు వందశాతం లక్ష్యాలను సాధించాలి

రాయచోటి అర్బన్: పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీలు) వందశాతం నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జాతీయ ఆరోగ్యమిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంఓ) రియాజ్‌బేగ్ అన్నారు. శనివారం ఆయన మున్సిపల్ పరిధిలోని సంజీవనగర్ కాలనీలో పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని డీఎస్ఎంఓ విష్ణుతో కలసి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా రియాజ్‌బేగ్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నా రు. ప్రతిరోజు టెలీమెడిసిన్ సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ నవీన్, సిబ్బందిలు పాల్గొన్నారు.

వైభవం..ధ్వజారోహణం



ధ్వజపూజ నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: దేవతలారా రండి....కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవ వైభవాన్ని తిలకించండి అంటూ వేద పండితులు సకల దేవతలను ఆహ్వానించారు. తిరుమల తొలి గడప దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ అర్చకులు మయూరం కృష్ణమూర్తి, తివిక్రమ్, కృష్ణమూర్తి తదితరులతోపాటు నూతన అర్చక బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ధ్వజపూజ నిర్వహించారు. గరుడిని చిత్రం గల పతాకాన్ని ధ్వజంపై ఎగురవేశారు.

- ధ్వజారోహణం సందర్భంగా భక్తులకు అందజేసే దీనిని గరుడుని ప్రసాదంగా కొడిముద్దలుగా పేర్కొంటారు. సంతానం లేని వారు ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే తప్పక ఫలం లభిస్తుందన్న విశ్వాసం ఈ ప్రాంత భక్తుల్లో ఉంది. అనంతరం అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామిని ఊరేగించారు. సాయంత్రం స్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గాయకులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. అనంతరం అదే వేదికపై హరికథ నిర్వహించారు. రాత్రి స్వామి వారిని చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

12న ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల ప్రదర్శన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఈఓ తదితరులు

రాయచోటి: ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. ఈనెల 12వ తేదీ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టు ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లను శనివారం కలెక్టరేట్‌లో డీఈఓ శివ ప్రకాష్ రెడ్డితో కలిసి జేసీ ఆవిష్కరించారు. అన్నమయ్య జిల్లా, రాయచోటిలోని డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో దేశవ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి ఎంపికైన 245 ప్రాజెక్టులను ఈ పోటీల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థులందరూ పాల్గొనేటట్లు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖాధికారులకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ ప్రసాద్ బాబు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రిజిత్ నాయక్, హబీబ్‌లు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో కడప పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామాల్లోని లైట్ మోటారు వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. సీట్లు పరిమితంగా ఉన్నాయన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే శిక్షణ ఇస్తున్నామన్నారు. 30 సంవత్సరాల అనుభవం కలిగిన రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లతో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు 99592 25774, 73828 65145 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం అడవి కొత్త ఇండ్లుకు చెందిన హరినాథ్ కుమారుడు అశ్వర్థ(25) కుటుంబ సమస్యలతో శనివారం పురుగుమందు తాగాడు. అదేవిధంగా రామసముద్రం మండలం ఎలకపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు నరసింహులు(35) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సంబేపల్లె : సంబేపల్లె మండలం డీసీ వడ్డిపల్లి వద్ద పోలీసులు శనివారం నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించి పెద్దఎత్తున నాటుసారా తయారీ డంపును గుర్తించారు. వెంటనే బట్టీలను పగులగొట్టి 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

సంబేపల్లె : శెట్టిపల్లి గ్రామం డీసీ వడ్డిపల్లి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశంలోనే గొప్ప విద్యా సంస్థగా వైఎస్సార్ ఏఎఫ్‌యూ

- ఏపీ ఉన్నతవిద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి
- ఘనంగా డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ 4వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఉన్నతవిద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి


కళాకృతుల ప్రదర్శనను తిలకిస్తున్న ఉన్నత విద్యా మండలి ఛైర్మన్

ఏఎఫ్‌యూ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతతో ఏర్పాటైన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తే దేశంలోనే గొప్ప విద్యాసంస్థగా నిలుస్తుందని ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం 4వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2020లో ఏర్పాటైన విశ్వవిద్యాలయం అతి తక్కువ సమయంలోని చక్కటి ప్రగతి సాధించిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం జేఎన్‌ఏఎఫ్‌యూ హైదరాబాద్‌కు పరిమితం కాగా, నూతన రాష్ట్రంలో దాని కొరత తీర్చేందుకు ప్రత్యేక కోర్సులతో స్పెషలైజ్ యూనివర్సిటీగా కడపలో వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ఏర్పాటు చేశామన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు పలు పోటీల్లో జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయం సొంతభవనాల కోసం 110 ఎకరాల స్థలం కేటాయింపు జరిగిందని, త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా విశ్వవిద్యాలయం శంకుస్థాపనతో పాటు సొంత భవనాలు సమకూర్చుకుంటుందని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు అందరూ ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహిస్తే చక్కటి ప్రగతి సాధ్యమవుతుందన్నారు. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ప్రపంచస్థాయి ప్రమాణాలు కలిగిన విశ్వవిద్యాలయంగా రానున్న రోజుల్లో అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలని సూచించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఆహ్లాదకరమైన వాతావరణంలో నడుస్తోందన్నారు. ప్రత్యేక కోర్సులు కలిగిన విశ్వవిద్యాలయాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా విద్యార్థులు విజయం సాధించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న వసతులు, సౌకర్యాలతోనే విద్యార్థులు అద్భుతమైన విజయాలు సాధించారన్నారు. విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేస్తున్న అధ్యాపకులను ఆయన అభినందించారు. త్వరలోనే సొంతభవనాలను సమకూర్చుకుంటామని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీలు, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో అతిథులు మొక్కలు నాటి నీరుపోశారు. అలాగే విశ్వవిద్యాలయ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్కల్ప్చర్, పెయింటింగ్, ఆనిమేషన్, కళాకృతులు, ఫొటోగ్రఫీ ప్రదర్శనను వారు ప్రారంభించి తిలకించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూలో అధ్యాపకులకు పదోన్నతులు


పదోన్నతులు పొందిన అధ్యాపకులతో వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారు. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి వారిని అభినందించారు. ప్రొఫెసర్లుగా ఎంపికైన వారిలో జి. మెర్సీ విజేత (ఇంగ్లీషు), ఎల్. మాధవి (మ్యాథమాటిక్స్), జి. పార్వతి (పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్), కె.ఎస్.వి. కృష్ణారావు (కెమిస్ట్రీ), రియాజున్నీసా (బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్) ఉన్నారు. ఫైన్‌ఆర్ట్స్ విభాగానికి చెందిన డాక్టర్ కోట మృత్యుంజయరావు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి అందుకున్నారు.

బొలేరో వాహనం బోల్తా

- నలుగురికి గాయాలు
- 8 గొర్రెలు మృతి


బోల్తా పడిన బొలేరో వాహనం

మదనపల్లె : బొలేరో వాహనం బోల్తా పడి నలుగురికి తీవ్రగాయాలు కాగా, 8 గొర్రెలు మృతిచెందిన సంఘటన శనివారం మదనపల్లె బైపాస్‌రోడ్డులో జరిగింది. పట్టణానికి చెందిన సైపుల్లాఖాన్, అతడి కుమారుడు బాషాఖాన్(28), అదేవిధంగా మదనపల్లె మండలం కొండామారిపల్లె పంచాయతీ బోడుమల్లుదిన్నెకు చెందిన రామయ్య, నరసింహులు కొత్తపల్లె పంచాయతీ బండకాడపల్లెలో ఉమ్మడిగా గొర్రెలు కొని శనివారం తెల్లవారుజామున కురబలకోట మండలం అంగళ్లు సంతకు బొలేరో వాహనంలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో బొలేరో బైపాస్‌రోడ్డులో వెళుతుండగా, డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడగా, వాహనం గొర్రెల మీద పడటంతో రూ.1.5లక్ష విలువచేసే 8 గొర్రెలు మృతిచెందాయి. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఎంపీ స్నేహితుడికి అంతిమ వీడ్కోలు


లోకనాథరెడ్డి పాడె మోస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు : గుండెపోటుతో మృతి చెందిన ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి స్నేహితుడు అరవ లోకనాథ్‌రెడ్డికి శనివారం అంతిమ వీడ్కోలు పలికారు. మండలంలోని వేపులబైలు పంచాయతీ అరవవాండ్లపల్లెకు చెందిన అరవ లోకనాథరెడ్డి గత 25 ఏళ్లుగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి స్నేహితుడు. కొన్నేళ్లగా ఎంపీతోనే కలసి చేదోడువాదోడుగా ఉంటున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్న లోకనాథరెడ్డి గుండెపోటుకు గురయ్యాడు. ఆయనను ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం ఉదయం మృతదేహాన్ని ఆయన స్వగ్రామం అరవవాండ్లపల్లెకు తీసుకు వచ్చారు. ఎంపీ మిథున్‌రెడ్డి స్నేహితుడి మృతదేహానికి నివాళులర్పించి కంటతడిపెట్టారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. స్నేహితుడి పాడెను ఎంపీ మోశారు. లోకనాథరెడ్డి భార్య, పిల్లలను ఓదార్చి, మృతుని కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎంపీ తెలిపారు. అలాగే పీలేరు, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి తోపాటు పలువురు ప్రముఖులు లోకనాథరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ డాక్టర్ మృతి


లిఖిత్ కుమార్ రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుడు ఆకేపాటి వెంకట శివారెడ్డి చిన్న కుమారుడు, జూనియర్ డాక్టర్ లిఖిత్ కుమార్ రెడ్డి(22) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి తిరిగి కారులో వస్తుండగా.. చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి మండలం సమీపాన సత్తారు బావి వద్దకు రాగానే కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని పక్కనే ఉన్న లోయలో పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న తన స్నేహితులు శశి, భరత్, వెంకటేష్, త్రిలోక్‌లు గాయాలతో బయటపడగా తలకు తీవ్రగాయమైన లిఖిత్‌కుమార్‌రెడ్డి మృత్యువాత పడ్డాడు. లిఖిత్ కుమార్‌రెడ్డి మురుకంబట్టు అపోలో కళాశాలలో జూనియర్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లిఖిత్ కుమార్‌రెడ్డి మరణవార్త విన్న బంధువులు, కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. లిఖిత్ కుమార్‌రెడ్డి మృతదేహాన్ని స్వగృహానికి తీసుకువచ్చిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఒంటిమిట్టకు చేరుకొని లిఖిత్‌కుమార్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను, ఆయన తండ్రి శివారెడ్డిని ఓదార్చారు. చేతి కందిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ఐరగంరెడ్డి సుబ్బారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తేలూరు శేషారెడ్డి, బ్యాంకు శివారెడ్డి తదితరులు ఉన్నారు.

480 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

రామాపురం : మండల కేంద్రంలోని పఠాన్ బాబ్‌జాన్ ఇంటి వద్ద 480 కేజీల బరువు గల 12 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి ఏపీ 02 టీడీ 0453 ఆటోలో రాయచోటి వైపు వెళ్తున్నట్లు ముందస్తు సమాచారంతో తహసీల్దార్ అరవింద్‌కిశోర్, ఎస్ఐ వి.ఎల్ ప్రసాద్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి ఆటోను, ఆటోలోని బియ్యాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్ బాబ్‌జాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రాణాలు తీసిన ఆన్‌లైన్ గేమ్


శివానందరెడ్డి (ఫైల్)

ఎర్రగుంట్ల : సెల్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి భారీగా నష్టపోయి అప్పులు తీర్చాల్సి వస్తుందేమోనని భయపడి శివానందరెడ్డి (25) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఎర్రగుంట్లలో చోటుచేసుకుంది. ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని క్రాంతినగర్ కాలనీలో నివాసం ఉండే సంజీవరెడ్డి, ఈశ్వరమ్మలకు ముగ్గురు సంతానం. వీరిలో శివానందరెడ్డి బీటెక్ చదువుకున్నాడు. ఇతను సెల్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడ్డాడు. దీంతో నిత్యం ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ భారీగా అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేననే భయంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు కింద పడి ఐటీబీపీ హెడ్ కానిస్టేబుల్ మృతి


మృతి చెందిన కె. విజేస్

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వే కేంద్రంలో ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) హెడ్ కానిస్టేబుల్ కె.విజేస్ (41) ప్రమాదవశాత్తు రైలుకిందపడి మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. ఆర్‌పీఎఫ్ పోలీసుల కథనం మేరకు ట్రైన్ నెంబరు. 16382 కన్యాకుమారి నుంచి పూణే వెళ్తున్న జయంతి జనతా ఎక్స్‌ప్రెస్‌లో విజేస్ పాల్ఘాట్ నుంచి తిరుపతికి బీ1 ఏసీ కోచ్‌లో 53 బెర్త్‌లో వచ్చాడు. తిరుపతిలో దిగాల్సి ఉండగా నిద్రపోయి నందలూరు వరకు చేరుకున్నాడు. నందలూరులో ఆ ట్రైన్‌కు స్టాపింగ్ లేనప్పటికీ రైల్వే ఉద్యోగుల అవసరం నిమిత్తం కొద్దిసేపు మెయిన్‌లైన్‌లో ఆగింది. ట్రైన్ ఆగిన విషయాన్ని గమనించి దిగేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. కేరళ రాష్ట్రానికి చెందిన కె.విజేస్ సెలవుపై వెళ్లి తిరిగి అన్నమయ్య జిల్లా కలికిరిలోని ఐటీబీపీ 53వ బెటాలియన్‌లో విధుల నిమిత్తం హాజరయ్యేందుకు వస్తూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఐటీబీపీ అడిషనల్ ఎస్పీ అశ్విన్, ఎస్ఐ వీవీ రెడ్డి, ఏఎస్ఐ పరంజిత్ యాదవ్, సెక్యూరిటీ ఫోర్స్ బాలరాజు, తమ్మిశెట్టిలు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానిక ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బందితో సంఘటన విషయాలను తెలుసుకొని మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ రాజారావు, ఎంసీఎస్ రెడ్డి, జీఆర్‌పీఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ సుభాన్ బాషా, సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెత్త మీద పడటంతో మహిళ మృతి

కొండాపురం : మండల పరిధిలోని దత్తాపురం పునరావాసకేంద్రంలో కొండల శ్రావణికుమారి (34) తన కలందొడ్డిలో గడ్డి వామి కిందభాగంలో చెత్తను పీకుతుండగా పై భాగం నుంచి చెత్త మీదపడటంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందింది. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ జి. చంద్రశేఖర్ వివరాల మేరకు.. దత్తాపురం గ్రామానికి చెందిన కొండల చంద్రశేఖర్‌రెడ్డి భార్య శ్రావణి కుమారిలు పాడి పరిశ్రమతో జీవనం సాగిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం వారి కలం దొడ్డిలో పశువులకు చెత్తను తీసుకువచ్చేందుకు వెళ్లింది. గడ్డి వామిలో కింది భాగంలో చెత్తను ఎక్కువ పీకకడంతో పై భాగం నుండి చెత్త ఒకేసారి మీదపడటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పన్నెండేళ్లకే.. నూరేళ్లు నిండిపోయాయి !

– దేవుని కడప చెరువులో స్నేహితులతో ఈతకు వెళ్లి బాలుడి మృతి


బాలుడి మృతదేహం

కడప అర్బన్ : తన స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు (12) నీట మునిగి ప్రాణాలను కోల్పోయి తల్లిదండ్రులకు, బంధువులకు విషాదాన్ని మిగిల్చాడు. ఈ సంఘటన కడప నగర శివార్లలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఖలీల్‌నగర్‌కు చెందిన మహబూబ్, ఆయేషాలకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. సంతానంలో చివరి వాడైన మహమ్మద్ (12) శనివారం మధ్యాహ్నం తన స్నేహితులతో సరదాగా దేవుని కడప చెరువు వద్దకు ఈతకు వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తరువాత ఈత రాకపోవడంతో నీటమునిగి గల్లంతయ్యాడు. వెంటనే సమాచారం అందుకున్న చిన్నచౌక్ పోలీసులు, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వెతికారు. పాతాళ భైరవి అనే పరికరంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 7 గంటల సమయంలో మహమ్మద్ మృతదేహం లభ్యమైంది. తల్లి ఆయేషా తన కుమారుడి మృతదేహంపై పడి బోరున విలపించింది. చిన్నచౌక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

నెట్టుకొంటూ వెళ్తున్న బైక్‌ను ఢీకొన్న మరో బైక్

- ఒకరి దుర్మరణం
- ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనాస్థలిలో బైక్‌లు (ఇన్‌సెట్) మృతి చెందిన రాఘవరెడ్డి

బి.కొత్తకోట : పెళ్లి చూసుకుని తిరిగి వెళ్తున్న బైక్‌లో పెట్రోలు అయిపోవడంతో నెట్టుకుంటూ వెళ్తుండగా మరో బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం రాత్రి బి.కొత్తకోట సమీపంలోని నక్కరాజుపల్లె క్రాస్ వద్ద జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్ కథనం మేరకు వివరాలు. పెద్దతిప్పసముద్రం మండలం కాప్పల్లెకు చెందిన యూ.సురేష్ (37), పి.సురేష్ (40) మిత్రులు. శనివారం రాత్రి బి.కొత్తకోటలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. దారిలో బైక్‌లో పెట్రోలు అయిపోవడంతో ఇద్దరూ బైక్‌ను నెట్టుకొంటూ సమీపంలోని నక్కరాజుపల్లె క్రాస్ వద్దకు వెళ్తున్నారు. ఇదే సమయంలో పెద్దతిప్పసముద్రం మండలం పెద్దమేకలవారిపల్లెకు చెందిన రాఘవరెడ్డి (33) బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. రాత్రివేళ కావడంతో ఎదురుగా నెట్టుకొంటూ వెళ్తున్న బైక్‌ను గుర్తించకపోవడంతో వారిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాఘవరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. యూ.సురేష్, పి.సురేష్‌లకు ఎడమ కాళ్లు విరిగి గాయపడ్డారు. బాధితులను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

జూదరుల అరెస్టు

బి.కొత్తకోట : బి.కొత్తకోట సమీపంలోని ఊజార్లపల్లె కంపచెట్ల మధ్య పేకాట జూదం ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ దాడిలో పేకాడుతున్న సాంపాళ్యం వెంకటరమణ, డి.చంద్రశేఖర్‌రెడ్డి, డి.ఓబులేశు, జి.ఎర్రప్ప, జి.ఉత్తన్నలను అరెస్టు చేసి వారినుంచి రూ.2,100 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మద్యం తరలిస్తున్న మినీలారీ పట్టివేత

బి.కొత్తకోట : అక్రమంగా మద్యం తరలిస్తున్న మినీలారీని స్వాధీనం చేసుకున్నామని సీఐ సూర్యనారాయణ శనివారం తెలిపారు. మండలంలోని బడికాయలపల్లె చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా మినీలారీలో 96 మద్యం ప్యాకెట్లు ఉండగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కర్ణాటకలోని శ్రీనివాసపురం తాలూకా లక్ష్మీపురం గ్రామానికి చెందిన డ్రైవర్ చలపతిని అరెస్ట్ చేశామన్నారు.

కట్నం కోసం వేధింపులపై కేసు

బి.కొత్తకోట : అదనపు కట్నం కోసం వేధిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ శనివారం తెలిపారు. మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీ గుట్టమీద హరిజనవాడకు చెందిన డి.రేణుక (30)కు ములకలచెరువు మండలం నాయనచెరువుకు చెందిన శ్రీనుతో గత ఏడాది ఫిబ్రవరి 16న అమరనారాయణపురం ఆలయంలో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.5లక్షల కట్నం, బంగారు ఆభరణాలను ఇచ్చారు. గత నాలుగు నెలలుగా అదనపు కట్నం కోసం తనను వేధింపులకు గురిచేస్తున్నట్లు రేణుక స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీనిపై రేణుక భర్త శ్రీను, బావ గంగరాజు, అతని భార్య గంగులమ్మ, ఆడబిడ్డ ఈశ్వరమ్మ, ఈరప్పలపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పరిశోధనాత్మక దృక్పథం అలవరుచుకోవాలి

ఘనంగా ప్రారంభమైన వైఎస్సార్ జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన


జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ రాఘవరెడ్డి

బద్వేలు అర్బన్ : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పరిశోధనాత్మక దృక్పథం అలవాటు చేసుకోవాలని పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ వై.రాఘవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు జరగనున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య విద్యార్థి సైతం గొప్ప శాస్త్రవేత్త కాగల మేధస్సును కలిగి ఉంటాడని, ఆ దిశగా విద్యార్థులు ప్రయత్నించి సమాజానికి అవసరమైన సాంకేతికను అందివ్వాలని కోరారు. సైన్స్ పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ప్రోత్సాహం అందించేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ పూర్వపు దినాలలో అనాగరికంగా ఉన్న మనం ఈ రోజు శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించి ముందుకు సాగుతున్నామని, దీని వెనుక ఎంతో మంది శాస్త్రవేత్తల కృషి దాగి ఉందని అన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ విశ్రాంత ప్రొఫెసర్ బి.ఎస్.పి.రాజు, సెంట్రల్ అబ్జర్వర్ మహిమ కార్తికేయలు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు బాలశాస్త్రవేత్తల నుండే ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. జిల్లా నలుమూలల నుండి దాదాపు 150 సైన్స్ ప్రాజెక్టులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నాయి. జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, వైజ్ఞానిక ప్రదర్శన కన్వీనర్ జి.వెంకటసుబ్బారెడ్డి, వైవీయూ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, ఎంఈఓలు చెన్నయ్య, రఘురాములు, ప్రమీల, సునీల్‌కుమార్, రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.